
చెల్లి కనిపించలేదని అన్న / గొడవపడ్డాడని చెల్లి ఆత్మహత్య

- అంతకుముందు ఇద్దరి మధ్య గొడవ
- ఇంట్లో నుంచి వెళ్లి నీటి కుంటలోకి దూకిన సోదరి
- చెల్లి ఆచూకీ చిక్కకపోవడంతో పురుగుల మందు తాగిన అన్న

7 లో



15 రోజుల్లో హైవే పనులను పూర్తిచేయాలి

- నాలాల ఆక్రమణదారులకు నోటీసులివ్వాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, సెప్టెంబరు 2 : పదిహేను రోజుల్లో హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న నేషనల్ హైవే పనులను పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పనులు అలస్యంగా జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ హైవే పనులను ఎవరు అడ్డుకోకుండా పోలీసు భద్రతను ఏర్పాటు చేయాలని ఏసీపీని ఆదేశించారు. విద్యుత్, డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. వరదనీటి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు. నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినవారికి నోటీసులు ఇవ్వాలన్నారు. కూలిన ఆర్టీసీ డిపో ప్రహరీని నిర్మించాలని డీఎంకు సూచించారు. వర్షాలతో ఆయా మండలాల్లో దెబ్బతిన్న రోడ్ల వివరాలను ఇవ్వాలన్నారు. బస్వాపూర్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఆర్డీవో రామ్మూర్తి, కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు వరద ప్రాంతాలను మంత్రి పొన్నం పరిశీలించారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళి..

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 2 : హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, నాయకులు చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, కోమటి స్వర్ణలత, సరోజన, రాములు తదితరులున్నారు.



హుస్నాబాద్ పట్టణంలో పర్యటిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అప్రమత్తంగా ఉన్నాం

మంజీరా డ్యామ్‌ను సందర్శించిన మంత్రి దామోదర, జగ్గారెడ్డి

వర్షాలపై కలెక్టరేట్‌లో అధికారులతో అత్యవసర సమావేశం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 2 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామ సమీపంలోని మంజీరా బ్యారేజీని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్‌లతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందోల్, న్యాల్‌కల్, బొల్లారం తదితర మండలాల్లో అధిక వర్షపాతం నమోదైనందున ఆయా ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని మంజీరా బ్యారేజ్ పూర్తిగా నిండి కిందికి నీటిని వదులుతుండడంతో తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. చెరువులు, వాగులు, వంకల వైపు ప్రజలు వెళ్లకుండా చూడాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను మంత్రి ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్నట్టు తెలిపారు. రానున్న 48 గంటల్లో కూడా భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని కోరారు. దెబ్బతిన్న పంటలు, ఇళ్లకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. కల్పగూర్ గ్రామ పరిధిలోని అంగడిపేట గ్రామంలో వర్షానికి కూలిన ఇంటిని మంత్రి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో వర్షాలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వారివెంట టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





మంజీరా డ్యామ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దామోదర, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, కలెక్టర్ క్రాంతి



సిద్దిపేట శివారులోని నర్సాపూర్‌లో పొలాల్లోకి వరద నీరు



చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతు..

బెజ్జంకి, సెప్టెంబరు 2 : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతయ్యాడు. తోటపల్లికి చెందిన సందిరి లక్ష్మణ్(45) ఆదివారం సాయంత్రం చేపల వేటకు కోసి గ్రామ శివారులోని తోటపల్లి రిజర్వాయర్ సమీపంలోని కల్వర్టు వద్దకు వెళ్లాడు. చేపలు పట్టుకొని కల్వర్టు దాటుతుండగా వరదలో చిక్కుకొని గల్లంతయ్యాడు. రాత్రి అయినా లక్ష్మణ్ తిరిగి రాకపోవడంతో అతడి కుమారుడు పోలీసులకు సమాచారం అందించాడు. సోమవారం ఉదయం నుంచి రెస్క్యూ, పోలీస్, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. సంఘటన స్థలాన్ని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట ఏసీపీ మధు, సీఐ శ్రీను, ఎస్ఐ కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



అలుగు పారుతున్న జగదేవ్‌పూర్ ఇటిక్యాల చెక్‌డ్యాం..

శనిగరం ప్రాజెక్టుకు జలకళ

కోహెడ, సెప్టెంబరు 2 : కోహెడ మండలంలో చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బస్వాపూర్ ఫీడర్ చానల్ ద్వారా శనిగరం ప్రాజెక్టులోకి భారీ వరద వస్తుండగా ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. సింగరాయ ప్రాజెక్టు నిండుకుండలా మారి మత్తడి దూకుతుంది.

వాన ఆగింది.. నష్టం మిగిలింది



మద్దూరు : లద్నూరులో వర్షానికి కూలిన ఇల్లు



చేర్యాల : భారీగా నిలిచిన వర్షపు నీరు

భారీ వర్షాలకు ఉమ్మడి మెదక్ జిల్లా అతలాకుతలమైంది. ప్రస్తుత సీజన్‌లో రికార్డుస్థాయి వానలు కురవడంతో వరద ప్రవాహం పోటెత్తింది. వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. వందల ఇళ్లు నేలమట్టం కాగా.. మరికొన్ని పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఇక వరద బీభత్సానికి పలుచోట్ల రోడ్లు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. రెండు రోజులు పాటు వణుకు పుట్టించిన వర్షం ఆగడంతో నష్టం అంచనా వేయడంపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టింది.

- భారీ వర్షానికి దెబ్బతిన్న రహదారులు
- వందల ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- పలుచోట్ల ధ్వంసమైన ఇళ్లు
- పొంగిపొర్లుతున్న వాగులు
- విద్యుత్‌శాఖకు తప్పని ఇబ్బందులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, సెప్టెంబరు 2: భారీ వర్షాల ప్రభావం నుంచి సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలు కోలుకున్నాయి. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని రెడ్‌అలర్ట్ ప్రకటించారు. కానీ, మోస్తారు నుంచి భారీ వర్షాలు మాత్రమే నమోదుకావడం ఉపశమనాన్ని కలిగించింది. అయినప్పటికీ ఈ సీజన్‌లోనే రికార్డు స్థాయిలో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాలా మండలాల్లో 10 సెం.మీ.లకు పైగానే వర్షపాతం కురిసింది. అయితే వరుణుడు శాంతించినప్పటికీ వరద ప్రవాహం మాత్రం తగ్గలేదు.

నీటమునిగిన పంటలు

సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పత్తి, వరి పంటలు నీట మునిగాయి. ఇప్పటికీ పలుచోట్ల నీళ్లలోనే ముంపునకు గురై ఉండడం గమనార్హం. సిద్దిపేట జిల్లాలో 1,323 ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో 655 ఎకరాలు, మెదక్ జిల్లాలో 165 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మెదక్ జిల్లా హవేళీఘనపురం పెద్ద చెరువు కట్ట తెగడంతో 125 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, గజ్వేల్, దౌల్తాబాద్ మండలాల్లోనే వరద ప్రభావంతో పంటలు నీటమునిగాయి. వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లినట్లుగా అధికారులు అంచనా వేశారు. ఇక కూరగాయల తోటలూ దెబ్బతిన్నాయి. సంగారెడ్డి జిల్లాలో నారింజ వాగు ముంచెత్తడంతో జహీరాబాద్ డివిజన్‌లో భారీగా పంటలు నీట మునిగాయి. తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇళ్లు.. రహదారులు ధ్వంసం

ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా సుమారు 400 ఇళ్లు వర్షానికి ధ్వంసమయ్యాయి. ఇందులో కొన్ని నేలమట్టం కాగా.. మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. దెబ్బతిన్న ఇళ్ల వివరాలను రెవెన్యూ అధికారులు సందర్శించి నమోదు చేసుకున్నారు. ఇక చెరువులు, కుంటల సమీపంలో నిర్మించుకున్న ఇళ్ల చుట్టూ వరద ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లకూ నష్టం తప్పలేదు. ఇక వరద ప్రవాహానికి చాలాచోట్ల రహదారులు ధ్వంసమయ్యాయి. సిద్దిపేట జిల్లాలో 25 చోట్ల రహదారులు దెబ్బతిన్నట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. మెదక్ జిల్లాలో నర్సాపూర్-కుక్కునూరు, జోగిపేట-చిన్నఘన్‌పూర్, ధర్మసాగర్-మంగల్పర్తి, పోతంశెట్టిపల్లి- వెల్దుర్తి, ఏల్పుగొండ ఎక్స్‌రోడ్- ఉత్లూర్ ఎక్స్‌రోడ్ రహదారులు ధ్వంసమైనట్లుగా గుర్తించారు. సంగారెడ్డి జిల్లాలోనూ రహదారులు కోతకు గురయ్యాయి.

అప్రమత్తమైన యంత్రాంగం

అధికార యంత్రాంగం అప్రమత్తమై నష్ట నివారణ చర్యలు చేపట్టింది. అటు సంగారెడ్డి, మెదక్, ఇటు సిద్దిపేట కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమస్యలపై దృష్టి పెట్టారు. కలెక్టర్లు, ఎస్పీలు, సీపీ సైతం వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ప్రాణనష్టాలు సంభవించకుండా పలు రహదారులు, కల్వర్టుల వద్ద రాకపోకలు నిలిపివేశారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా వాహనాలను దారి మళ్లించడంపై దృష్టిసారించారు. గ్రామాలు, మండలాల ప్రత్యేకాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో విద్యుత్‌శాఖకు భారీగా నష్టం సంభవించినట్లుగా తెలుస్తోంది. వరద తాకిడికి విద్యుత్ స్తంభాలు నేలకూలడం, వంగిపోవడంతో వాటిని సరిచేస్తున్నారు. అదేవిధంగా, చెరువులు, కుంటలకు గండ్లు పడిన క్రమంలో నష్టం జరగకుండా చర్యలు చేపట్టారు.



మత్తడి దూకుతున్న దుబ్బాక రామసముద్రం చెరువు



తెగిపోయి ప్రమాదకరంగా మారిన దర్గా రోడ్డు.



కోహెడలో పరవళ్లు తొక్కుతున్న శనిగరం ప్రాజెక్టు..



సిద్దిపేట రూరల్ : రాఘవాపూర్ పెద్దచెరువు మత్తడి కింద పడిన బుంగ

నాలాల మూసివేత.. రోడ్డెక్కిన చెరువు

- చేర్యాల గాంధీచౌక్, బస్టాండ్ జలదిగ్బంధం

చేర్యాల, సెప్టెంబరు 2 : పట్టణంలోని కుడిచెరువుకు వరదనీరు వెళ్లే నాలాలు మూసుకుపోవడంతో చెరువు రోడ్డెక్కింది. గుంటూరుపల్లి, శ్రీరాంనగర్ కాలనీ, కడవేరుగు మార్గంగుండా చెరువులోకి వరదనీరు చేరే నాలాను పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పాటు కల్వర్టులు మూసుకుపోవడం, ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలతో వర్షానికి గాంధీచౌక్, ఆర్టీసీ బస్టాండ్ జలదిగ్బంధమయ్యాయి. ఆదిఆంజనేయస్వామి దేవాలయం, ఇండ్లు, దుకాణాల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. మున్సిపల్ కమిషనర్ నాగేందర్ చొరవ తీసుకొని గాంధీచౌక్ సమీపంలోని కల్వర్టు వద్ద మట్టిని తొలగించడంతో పాటు డివైడర్లు ధ్వంసం చేసి నీటిని మళ్లించడంతో కాస్త ఊరట లభించింది.



ఆర్టీసీ బస్టాండు ఎదురుగా రోడ్డుపై నిల్చి ఉన్న వరదనీరు

సురక్షిత ప్రాంతానికి తరలింపు..

చేర్యాల, సెప్టెంబరు 2 : భారీ వర్షాల దృష్ట్యా లోతట్టుప్రాంతాల ప్రజలను అధికారులకు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సోమవారం కొమురవెల్లి మండలం లెనిన్ నగర్ గ్రామంలోని పాతకాలనీవాసులను తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎస్ఐ రాజుగౌడ్ సురక్షిత ప్రాంతానికి తరలించారు.



సిద్దిపేట రూరల్: జక్కాపూర్ లో కూలిన ఇల్లు



మురుగునీరు శుద్ధి కర్మాగారాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్రిత్‌కుమార్

పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 2 : పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, మెప్మా సిబ్బందితో ఆయన సమీక్ష జరిపారు. ఇంటి, నీటి పన్ను వసూలుపై ఆరా తీశారు. బాధ్యతగా పనిచేసి మరిన్ని అవార్డులు తీసుకువద్దామన్నారు. సమావేశంలో అధికారులు శ్రీకాంత్, బాలకృష్ణ, సాయికృష్ణ, రమ్య, జ్యోతి, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు. అనంతరం మురుగునీటి శుద్ధి కర్మాగారం, కమ్మర్లపల్లిలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, పంప్ హౌజ్‌ల నిర్వహణను కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట అధికారులు అన్వేష్, వనిత ఉన్నారు.

వినాయక చవితి ఉత్సవాలను

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- నిర్వాహకులు వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలి
- పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలి
- మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 2 : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రకటనలో సూచించారు. పోలీస్‌శాఖ రూపొందించిన పోర్టల్ ద్వారా మండపాల నిర్వాహకులు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మండప నిర్వహణ, సమాచారం కోసం ప్రత్యేక పోర్టల్ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు పూర్తి చేసిన తర్వాత దరఖాస్తుదారుడు అప్లికేషన్ ఫారంతో పాటు అంగీకారపత్రాన్ని సంబంధిత స్టేషన్‌లో అందజేయాలన్నారు. ఏ సమస్య ఉన్నా.. పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వివిధశాఖల అధికారులతో అనుమతులు తీసుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలుగకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బాలస్వామి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.

సమాచారం లేకుండా

విధులకు డుమ్మాకొట్టిన వారిపై చర్యలు

- కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు : డీఎంహెచ్‌వో

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 2: గత నెల 31న కొల్చారం ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసినపుడు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉద్యోగులపై ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్‌వో శ్రీరాం తెలిపారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రమేష్‌కు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయూష్ సిబ్బంది, డాక్టర్ హర్ష, కాంపౌండర్ రజిత, సపోర్టింగ్ స్టాఫ్ పెంటయ్యను ఉద్యోగం నుంచి తొలగించినట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. విధులకు చెప్పాపెట్టకుండా డుమ్మాకొట్టే ఎంతటి స్థాయి ఉద్యోగులైనా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దుబాయ్‌లో మెదక్‌వాసి మృతి

- మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావాలని ఎంపీకి వినతి


రాట్ల సూర్య(ఫైల్)

మెదక్ అర్బన్, సెప్టెంబరు2: బతుకుదెరువు కోసం దుబాయ్‌కు వెళ్లిన మెదక్ జిల్లాకు చెందిన యువకుడు మృతిచెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన రాట్ల సూర్య(34)జీవనోపాధి కోసం గతనెల ఆగస్టు 6న దుబాయ్ వెళ్లాడు. అతను నాలుగు రోజుల క్రితం మరణించినట్లు ఏజెంట్ ద్వారా తెలిసింది. సూర్య మృతి చెందాడన్న వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సూర్య మృతదేహాన్ని త్వరగా స్వస్థలానికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు స్థానిక మాజీ సర్పంచ్ ఎలక్షన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీ ఇండియన్ ఎంబసీతో మాట్లాడారు. సూర్య మృతదేహం త్వరగా స్వస్థలానికి తీసుకొచ్చేలా చర్యలు చేపడతానని, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. మృతునికి భార్య సరిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా సూర్య మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కొత్తిమీర ధరకు రెక్కలు

- కిలో రూ.250 చొప్పున విక్రయం


నారాయణఖేడ్‌లో విక్రయానికి వచ్చిన కొత్తిమీర

నారాయణఖేడ్, సెప్టెంబరు2: కొత్తిమీర ధరకు రెక్కలు రావడంతో కొనుగోలు చేయడానికి ప్రజలు జంకుతున్నారు. ప్రస్తుతం శుభకార్యాల సీజన్ కావడంతో కొత్తిమీరకు డిమాండ్ పెరిగింది. అలాగే నిరంతరం కురుస్తున్న వర్షాలకు చాలాచోట్ల పంట దెబ్బతింది. ఆ ప్రభావం కూడా ధరలు పెరగడానికి కారణం. ఉన్న కొద్దిపాటి కొత్తిమీరను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మార్కెట్‌లో గత వారం కిలో కొత్తిమీర రూ.100 చొప్పున విక్రయించారు. సోమవారం రూ.250 చొప్పున అమ్మారు. రూ.10కి రీటైల్‌గా అమ్మడం లేదని, ఇలా అయితే కొత్తిమీరను కొనడం కష్టమే అని జనాలు చర్చించుకుంటున్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు.. వరదకు చెరువులకు బుంగలు


రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌లో కూలిన ఇల్లు


అల్లాదుర్గంలో కూలిన ఇల్లు


వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ


కంగ్టిలో వర్షానికి కూలిన ఇంటి వద్ద బాధితురాలు


నిజాంపేట మండలంలో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారి


చౌటకూరు మండలంలో కూలిన ఇంటి వద్ద బాధితురాలు దమ్మి పద్మమ్మ

మూడు రోజులుగా ముంచెత్తిన వర్షాలతో పలు గ్రామాల్లో ఇళ్లు కూలిపోగా, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆయా మండలాల రెవెన్యూ అధికారులు ఇళ్లను సందర్శించి నష్ట వివరాల నివేదికను రూపొందిస్తున్నారు.. ఎడతెగని వర్షాలకు వరద నీరు చేరి చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. కొన్ని చోట్ల చెరువులకు బుంగలు పడ్డాయి.

● కంది : కంది మండలం మామిడిపల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లి గుడి కూలిపోయింది. ఎర్దనూర్ నుంచి ఎర్దనూర్ తండాకు వెళ్లే దారిలోని వాగు అలుగు పారుతుండడంతో ఆ రెండు గ్రామాలకు రాకపోకలను సంగారెడ్డి రూరల్ పోలీసులు నిలిపివేశారు.

● సంగారెడ్డి రూరల్ : సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడిపేటలో పాత ఇళ్లు వర్షానికి కూలిపోయింది. వర్షానికి రోడ్డు, పాత భవనాలు ధ్వంసమయ్యాయే కాని ఎలాంటి ప్రాణ నష్టం, పెద్దగా ఆస్తినష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

● కంగ్టి : వర్షం ధాటికి మండల కేంద్రమైన కంగ్టిలో సోమవారం గాజుల మహబూబ్‌బికు చెందిన నివాస గృహం కూలింది. కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగించే తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంది.

● నారాయణఖేడ్ : మండలంలోని ర్యాకల్‌తోపాటు నిజాంపేట మండలం బాచేపల్లిలో పలువురి గృహాలు వర్షానికి పాక్షికంగా దెబ్బతిన్నాయి.

● పుల్‌కల్ : మండల కేంద్రమైన చౌటకూర్‌లో వర్షానికి తడిసి దమ్మి పద్మమ్మకు చెందిన పెంకుటిల్లు కూలింది. చౌటకూర్ నుంచి పోసానిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో చెట్టు కూలి రోడ్డుపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● వట్‌పల్లి : మండలంలోని పోతులబొగుడ గ్రామంలో పత్తి పంట మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లు కూలగా తహసీల్దార్ విచారణ జరుపుతున్నారు.

● అల్లాదుర్గం : వర్షం తాకిడికి మండలంలోని ఆయా గ్రామాల్లో గృహాలు కూలిపోయినట్లు బాధితులు ఫిర్యాదు చేయడంతో స్థానిక తహసీల్దార్ మల్లయ్య, రెవెన్యూ సిబ్బందితో కలసి పరిశీలించారు. 9 ఇళ్లు కూలిపోయాయని తహసీల్దార్ తెలిపారు.

● రేగోడు : వర్షానికి రేగోడు మండలంలో మూడు ఇండ్లు పాక్షికంగా కూలిపోయినట్లు బాధితులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

● నిజాంపేట : మండల కేంద్రంలోని గర్లుల లక్ష్మి చెందిన ఇల్లు కూలిపోయింది. రెవెన్యూ అధికారి ఇల్లును పరిశీలించిన నష్టాన్ని అంచనా వేశారు.

● చిన్నశంకరంపేట : మండలంలోని జంగరాయి వాగు ఉప్పొంగడంతో మత్తడి ధ్వంసం అయింది. చందంపేట చెరువుకు బుంగపడి నీరు వృథాగా పోతుంది. కొన్ని గ్రామాల్లోని ఇళ్లు కూలిపోగా, మరికొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

● పెద్దశంకరంపేట : పెద్దశంకరంపేట, గొట్టిముక్కుల, చీలపల్లి, రామోజీపల్లి, నారాయణపల్లి, తదితర గ్రామాల్లో పలు గృహాలు పాక్షికంగా కూలిపోయాయి. తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఆర్ఐ శర్దప్ప ఆయా గ్రామాల్లో కూలిన గృహాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని పేర్కొన్నారు.

● పాపన్నపేట : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సుమారు 21 ఇళ్లు దెబ్బతిన్నాయి. స్థానిక తహసీల్దార్ సతీష్, ఆర్ఐ శ్రీనివాస్ ఆయా గ్రామాల్లో పర్యటించి నివేదిక తయారు చేస్తున్నారు.

● చిలప్‌చెడ్ : మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో రెడ్డిగల్ల నర్సింలు, గణపురం కిష్టమ్మ, రామస్వామి మల్లాగౌడ్‌ల ఇళ్లలు, సోమక్కపేటలో మచ్చూరి బాలయ్య ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సోమవారం ఎంపీడీవో ఆనంద్ ఇళ్లను పరిశీలించారు.

● చేగుంట : మండల పరిదిలో 31 ఇళ్లు కూలిపోయాయని, నష్టం వివరాలను సేకరిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణ తెలిపారు. ఇళ్లు కూలిన వారిలో కొంతమందికి పునరావాసం కల్పించినట్లు పేర్కొన్నారు.

● రామాయంపేట : మండల పరిధి తోనిగండ్లలోని పులిచేరికుంటకు గండి పడింది. గమనించిన రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు. మెదక్ ఆర్డీవో రమాదేవి అక్కడికి చేరుకుని దగ్గరుండి పూడ్చి వేయించారు. స్థానిక బాలికల వసతి గృహ భవనం గదుల్లో వర్షపునీరు చేరి విద్యార్థినులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. తహసీల్దార్ భవనంలో లీకేజీలు ఏర్పడి ఫైళ్లు తడిశాయి. లక్ష్మాపూర్‌లో ఓ ఇళ్లు కూలింది. వందకుపైగా ఎకరాల్లో వరి పంట నీట మునిగింది

● కోహీర్ : మండలంలోని మద్రి గ్రామానికి చెందిన మరియమ్మ ఇల్లు, పర్షపల్లి గ్రామంలో నీరోజమ్మ ఇల్లుతో పాటు మాచిరెడ్డిపల్లి గ్రామంలో ఆనందం ఇల్లు కూలిపోయింది. కూలిన మూడు ఇళ్లను రెవెన్యూ అధికారులు పరిశీలించి నష్టపరిహారాన్ని అంచనా వేశారు. భారీ వర్షానికి కోహీర్‌లోని పట్లూర్‌బేస్ కాలనీలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయింది. రెండు రోజులు అవుతున్న విద్యుత్ అధికారులు ఇప్పటివరకు స్పందించలేదని కాలనీవాసులు పేర్కొన్నారు.


● రామచంద్రాపురం : కొల్లూరులోని పెద్దచెరువుల రెండు కాలువలను బిల్డర్లు మూసివేయడంతో చెరువు నిండలేదు. ఇటీవల ఓ బిల్డరు కడుతున్న ఇళ్ల సముదాయాలకు ఆగమేఘాల మీద ఏర్పాటు చేసిన రేడియల్ రోడ్డు 7 ఎక్స్టెన్షన్ దారి పూర్తిగా చెరువును తలపించింది. రోడ్డుపై మోకాల లోతు నీరు చేరింది. రేడియల్ రోడ్డు 30 ఎక్స్టెన్షన్‌పై కూడ నీరు నిలిచాయి. వరద నీరు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ నాలాపై నుంచి ప్రవహించాయి.


● పటాన్‌చెరు రూరల్ : ముత్తంగి రింగ్ రోడ్డు నుంచి పోచారం వెళ్లే సర్వీస్ రోడ్‌లో నక్క వాగు పొంగడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వెళ్లే రహదారిలో ఎల్లమ్మ గుడి సమీపంలో వాగు పొంగి రోడ్డుపైకి నీరు చేరడంతో తాత్కాలికంగా రోడ్డును మూసివేశారు.

● వెల్దుర్తి : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో 12 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, వాటిని పరిశీలించి బాధిత వివరాల నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తహసీల్దార్ కృష్ణ తెలిపారు.

● సిద్దిపేట రూరల్ : మండలంలోని రాఘవాపూర్ పెద్దరువు మత్తడికి బుంగపడి నీరు వృథాగా పోవడాన్ని స్థానికులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తం అయిన అధికారులు ఎక్స్‌కవేటర్‌తో బుంగను పూడ్చివేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 25 ఇళ్లు కూలిపోయినట్లు ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నారాయణరావుపేట వర్షాలకు మండలంలో ఆయా గ్రామాల్లో ఐదు ఇళ్లు కూలినట్లు ఆర్ఐ అర్జున్‌రెడ్డి తెలిపారు.

● వర్గల్ : మండలంలోని శాఖారం గ్రామం వద్ద రహదారిపై భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడింది. మాజీ ఉప సర్పంచ్ భాస్కర్‌గౌడ్ గ్రామస్థులతో కలిసి ఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్, తాళ్ల సహాయంతో వృక్షాన్ని రోడ్డు పక్కకు లాగేసి రోడ్డను క్లియర్‌చేశారు.


చిన్నశంకరంపేట మండలం చందంపేట చెరువుకు పడిన బుంగ


రామాయంపేట మండలం తోనిగండ్లలోని పులిచేరికుంటకు పడిన గండి

పిడుగుపాటుతో పాడిగేదే మృతి

నంగునూరు : పిడుగు పాటుతో పాడిగేదె మృతిచెందిన సంఘటన మండలంలోని అక్కెనపల్లిలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన సుద్దాల మహేష్ తన పాడి గేదెను వ్యవసాయ పొలంలో రోజు మాదిరి గానే కట్టివేసి ఇంటికి వెళ్లాడు. పాలు పితికేందుకు వెళ్లి చూడగా పాడి గేదె మృత్యువాత పడింది. సుమారు రూ.80 వేల విలువ ఉంటుందని తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ లింగం అక్కడికి పంచనామా నిర్వహించారు.

ఉధృతంగా జాడీమల్కాపూర్ జలపాతం

కర్ణాటక - తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని జాడీమల్కాపూర్, సంగాపూర్ గ్రామాల శివారులో ఉన్న జలపాతం పరవళ్లు తొక్కుతున్నది. మల్‌చెల్మ, గొటిగార్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి, కర్ణాటకలోని సంగాపూర్ నుంచి వరద నీరు జాడీమల్కాపూర్ జలపాతానికి చేరుతుంది.

-జహీరాబాద్



కూడవెల్లి పరవళ్లు.. మత్తడి దూకుతున్న ఎగువ మానేరు

దుబ్బాక : కూడవెల్లి వాగు పరవళ్లు తొక్కుతున్నది. దుబ్బాక నియోజకవర్గం పొడవునా 54 కిలోమీటర్ల పొడవునా కూడవెల్లి వాగుపై ఉన్న 36 చెక్‌డ్యాంలు పొంగుతున్నాయి. ఇక్కడి నుంచి నీరు రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీర్‌రావుపేట మండలం ఎగువమానేరు(నర్మాల)ప్రాజెక్టుకు నీరు తరలుతున్నది. రెండు టీఎంసీల నీళ్లు చేరి, 31 పీట్లతో నర్మాల మత్తడి దూకుతుంది. దుబ్బాకలో రామసముద్రం చెరువు, ఏదుల్లా చెరువు మినహా మండలంలోని అన్ని చెరువుల్లో 60శాతం నీరు నిండింది.


నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుకు జలకళ


కొల్లూరులో చెరువును తలపిస్తున్న ఎక్స్టెన్షన్ 7 రేడియల్ రోడ్డు


సదాశివపేటలో కూలిన ఇంటి పైకప్పును పరిశీలిస్తున్న పులిమామిడి రాజు

వర్షానికి కూలిన ఇళ్లను పరిశీలించిన పులిమామిడి రాజు

సదాశివపేట, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని 12వ వార్డులో దెబ్బతిన్న, కూలిపోయిన ఇళ్లను సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, పీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడిరాజు పట్టణ టౌన్‌ప్లానింగ్ అధికారి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన వారికి తక్షణమే సహాయం అందించాలని పులిమామిడిరాజు అధికారులను ఆదేశించారు. వార్డులో ఇంటింటి వద్దకు వెళ్లి పులిమామిడిరాజు పారిశుధ్య, విద్యుత్, తాగునీటి సరఫరా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కూలిన ఇళ్ల బాధితుల చేత స్థానిక తహసీల్దార్ కె.సరస్వతికి దరఖాస్తులను ఇప్పించారు. ఈ కార్యక్రమంలో పీఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య


అనూష(ఫైల్)

హవేళిఘణపూర్, సెప్టెంబరు 2 : అత్తవారింటి వేధింపులను తాళలేక వివాహిత ఆత్మాహత్యాయత్నం చేసుకుని చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పోచమ్మరాల్ గ్రామానికి చెందిన బొప్పాపురం మల్లిఖార్జున్ భార్య అనూష(22) ఈ నెల 29 తేదీన ఇంట్లో భర్త, అత్తమామలతో గొడవపడి పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి అస్వస్థతకు గురైంది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే ఆమెను మెదక్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందింది. తమ కుమార్తె ఆత్మహత్యకు భర్త, అత్తమామలే కారణమంటూ హవేళిఘణపూర్ పోలీస్‌స్టేషన్‌కు మృతురాలి బంధువులు చేరుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్‌రెడ్డి ఇరు వర్గాలను సముదాయించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనూష తండ్రి బాలేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేస్తుండగా... ఆపరేటర్‌కు కరెంట్‌షాక్

● ప్రస్తుతం నిలకడగా ఆరోగ్యం

గజ్వేల్, సెప్టెంబరు 2: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రైవేటు ఆపరేటర్‌కు విద్యుత్ షాక్ తగిలిన సంఘటన సోమవారం చోటచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. ప్రజ్ఞాపూర్ సబ్‌స్టేషన్ నుంచి శ్రీగిరిపల్లి, అక్కారం, కోనాపూర్ గ్రామాలకు వెళ్లే పరిశ్రమల లైన్‌పై శ్రీగిరిపల్లి దుర్గామాత ఆలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య వచ్చిందని, జంపర్ ఎగిరిపోయిందని లైన్‌మెన్ యుగంధర్‌తో పాటు అక్కా రం గ్రామానికి చెందిన ప్రైవేటు ఆపరేటర్ శివ మరమ్మతులు చేపట్టారు. ఈ క్రమంలో సబ్‌స్టేషన్ వద్ద ఇండస్ట్రియల్ లైన్‌తో పాటు గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్‌కు సంబంధించిన ఎల్‌సీ తీసుకున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి మరమ్మతులు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగి మంటలు చేలరేగి శివ కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే అతడిని ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ యశోదా ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం శివ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యుత్ తెలిపారని డీఈ భానుప్రకాశ్ తెలిపారు. అంతేకాకుండా ఎల్‌సీ తీసుకున్నా విద్యుత్ సరఫరా ఎలా జరిగిందనే అంశంపై విచారణ జరుపుతున్నామని డీఈ తెలిపారు. కాగా ఆపరేటర్ శివ ఎర్త్ రాడ్ ధరించలేదని తెలుస్తుంది. ఎర్త్‌రాడ్ ధరించి ఉంటే ప్రమాదం తప్పేదని పేర్కొన్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆపరేటర్ శివ

జపాన్ సకురా సైన్స్ ప్రోగ్రాంకు బీవీఆర్‌ఐటీ అధ్యాపకుల ఎంపిక

నర్సాపూర్,సెప్టెంబరు 2: నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీకి చెందిన నలుగురు అధ్యాపకులు జపాన్‌కు చెందిన సకురా సైన్స్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. బీవీఆర్‌ఐటీలోని అధ్యాపకులు డాక్టర్ రాజు, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ సంతోష జపాన్ స్పాన్సర్ చేసిన సైన్స్ ప్రోగ్రాంకు వెళ్లనున్నారు. వీరు ఔషధమొక్కల డీఎన్ఏ శ్రేణీ విశ్లేషణలో శిక్షణ పొందేందుకు, సాగా యూనివర్సిటీలో పరిశోధన సౌకర్యాలను అన్వేషించడానికి ఈనెల 13వ తేదీ వరకు అక్కడ సందర్శించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో పాలియేటివ్ కేర్‌తో రక్షణ

● ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు
● రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి


మాట్లాడుతున్న ప్రశాంతి

ములుగు, సెప్టెంబరు 2 : ప్రాణాంతక, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు పాలియేటివ్ కేర్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా క్షీరాసాగర్‌లోని హంస హోమియోపతి వైద్యశాల, పరిశోధన కేంద్రంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ వైద్యంతో రోగి శారీరకంగా, మానసికంగా గట్టెక్కడంతో పాటు జీవన నాణ్యత మెరుగుపడుతుందని చెప్పారు. పాలియేటివ్ కేర్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు ఇవ్వగా, సరైన చికిత్సలో బాధలను నిరోధించి ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. అలాగే పాలియేటివ్ కేర్‌లో వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్, ఫార్మాసిస్ట్, ఫిజియోథెరపిస్ట్ తదితర భాగస్వామ్యం ఉంటుందని, ప్రతీ మనిషి జీవితంలో అన్ని రకాల వైద్య వివరాలు వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే, ఈ విధానాన్ని మరింత మెరుగుపరచడానికి జాతీయస్థాయిలో మార్గదర్శకాలు రూపొందిస్తుండగా రోగుల్లో ఉపశమన సంరక్షణ సేవలు విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథిగా హాజరైన జేఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అల్లోపతి, ఆయుర్వేద, యునాని, హోమియో, నేచురోపతి సిద్ధ వంటి వైద్య విధానాల ప్రాముఖ్యతను గుర్తించాలని సూచించారు. హంస హోమియోపతి వైద్య కళాశాల డైరెక్టర్ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త విద్యుత్ సరఫరాపై రైతుల ఆగ్రహం

● గడిపెద్దాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన

అల్లాదుర్గం, సెప్టెంబరు 2 : వ్యవసాయ రంగానికి సరఫరా చేసే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తూ టేక్మాల్ మండలం దాదాయిపల్లి గ్రామానికి చెందిన రైతులు సోమవారం అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి, సబ్‌స్టేషన్ ఎదుట బైటాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులుగా వ్యవసాయ రంగానికి అందించాల్సిన త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను ఇష్టానుసారంగా ఇస్తుండటంతో తీవ్రఇబ్బందులను ఎదుర్కుంటున్నామన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా తమ గోడు పెడచెవిన పెడుతున్నారని వారు ఆవేదనను వ్యక్తం చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందిస్తూ ఇకపై విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అధికారుల హామీతో రైతులు ఈ ఆందోళన విరమించారు.



సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దాదాయిపల్లి రైతులు

భూమికి భూమి.. లేదంటే మార్కెట్ రేటు

● అలా అయితేనే ఆర్ఆర్ఆర్‌కు మా భూములిస్తాం
● అధికారులకు తేల్చి చెప్పిన ప్రాజెక్టు ఉత్తర భాగం రైతులు

జోగిపేట, సెప్టెంబరు 2: రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణంలో భాగంగా ఉత్తరం వైపున భూములు కోల్పోనున్న రైతులతో సోమవారం సంగారెడ్డి జిల్లా అందోలు-జోగిపేట ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ విభాగం, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సంయుక్తంగా అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీవో పాండు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చౌటకూరు, జోగిపేట మండలానికి చెందిన కొర్పోలు, శివంపేట, అంగడిపేట, వెంకటకిష్టాపూర్, లింగంపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. "భూమికి భూమి.. లేదంటే మార్కెట్ రేటు చెల్లిస్తేనే మా భూములిస్తాం" అని వారు అధికారులకు తేల్చి చెప్పారు. "మా ఊర్లో ఎకరాకు రూ.2-3కోట్లు ఉంటే.. ప్రభుత్వం రూ.21లక్షలు ఇస్తామనడం న్యాయమా" అని శివంపేట గ్రామస్థులు మండిపడ్డారు. గతంలో జేఎన్టీయూ కోసమని చెప్పి, నాలుగు వరుసల రోడ్డు అని చెప్పి తమ భూములు లాక్కున్నారని వారు గుర్తు చేశారు. "ఉన్న భూమిని మీకిస్తే.. మేం బతికేదెట్లా" అని అధికారులను నిలదీశారు. వెంకటకిష్టాపూర్, అంగడిపేట, లింగంపల్లి గ్రామాల వాసులేమో.. తమ గ్రామంలో మార్కెట్ రేటు రూ.50 లక్షలుందని, కానీ ప్రభుత్వం కేవలం రూ.6 లక్షలిస్తామంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో పాండు మాట్లాడుతూ.... రాష్ట్రప్రభుత్వం రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించే ఆలోచనలో ఉందని చెప్పారు. రైతులంతా సహకరిస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు.


అవగాహనా సదస్సులో అధికారులను నిలదీస్తున్న రైతులు

చెల్లి కనిపించలేదని అన్న గొడవపడ్డాడని చెల్లి ఆత్మహత్య

● అంతకుముందు ఇద్దరి మధ్య గొడవ
● ఇంట్లో నుంచి వెళ్లి నీటి కుంటలోకి దూకిన సోదరి
● చెల్లి ఆచూకీ చిక్కకపోవడంతో పురుగుల మందు తాగిన అన్న


కల్యాణి(ఫైల్)

దౌల్తాబాద్, సెప్టెంబర్ 2 : చిన్నగొడవ వల్ల మనస్తాపంతో అన్నాచెల్లెలు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియల్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందుప్రియల్‌కు చెందిన కాసులాబాద్ శ్యామల, కిష్టయ్యకు ముగ్గురు సంతానం. అనారోగ్యంతో శ్యామల కొద్దిరోజుల క్రితం మృతి చెందింది. పెద్దకొడుకు మహేష్, రెండవ కొడుకు రాము, కూతురు కల్యాణి తండ్రి కిష్టయ్యతో కలిసి ఉంటున్నారు. శనివారం రాత్రి తండ్రి కిష్టయ్యకు, రాముకు మధ్య గొడవ జరిగింది. వారిని సముదాయించేందుకు వెళ్లిన కల్యాణితో రాము గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన కల్యాణి ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో రాము, కుటుంబీకులు వెతికినా ఆచూకీ దొరకలేదు. తన వల్లే ఇదంతా జరిగింది అనుకుని మనస్తాపంతో రాము పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు స్థానిక ఆసుపత్రికి, ఆ తర్వాత గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం సాయంత్రం రాము మృతిచెందాడు. అప్పటికే ఇంట్లో నుంచి వెళ్లిన కల్యాణి నీటి కుంటలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రాము(ఫైల్)

రాత్రికిరాత్రే పరిశ్రమకు తాళం

● రోడ్డున పడిన కార్మికులు

మనోహరాబాద్, సెప్టెంబర్ 2: రాత్రికిరాత్రే పరిశ్రమకు తాళం వేయడంతో కంపెనీ వద్ద కార్మికులు నిరసన తెలుపుతున్నారు. పదిరోజులుగా ఆందోళన చేస్తున్నా కార్మికులను పట్టించుకునే వారు కరువయ్యారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారి అనుకుని మైకో సీడ్ పరిశ్రమ ఉంది. ఇందులో కొందరు కార్మికులు 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. ఈనెల 21వ తేదీన ఎవరికీ చెప్పకుండా రాత్రికిరాత్రి పరిశ్రమ గేట్‌కు తాళం వేసి, నోటీసు అంటించారు. ఉదయం వెళ్లిచూడగా పరిశ్రమ మూసివేసి ఉండడంతో కార్మికులు విస్తుపోయారు. దీంతో కార్మికులు నిరసన బాట పట్టారు. పరిశ్రమ ఎదుట పదిరోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. పరిశ్రమను ప్రారంభించి కార్మికులను ఆదుకోవాలని ఆందోళన చేస్తున్నామని ఐఎన్‌టీయూసీ నాయకుడు చంద్రారెడ్డి పేర్కొన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.


కాళ్లకల్‌లోని మైకో పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు



కొండపాక: అలుగు పారుతున్న దమ్మక్కపల్లి చెరువు



సిద్దిపేట రూరల్: రాఘవాపూర్ పెద్దచెరువు మత్తడి బుంగకు మరమ్మతు చేయిస్తున్న అధికారులు



హుస్నాబాద్: నిండు కుండలా హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు



జగదేవ్‌పూర్: పొంగిపొర్లుతున్న రాజకట్ట జలాశయం

నిండు కుండల్లా చెరువులు, కుంటలు

- వర్షాలకు తెగిన పలు గ్రామాల రోడ్లు
- పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

కొండపాక, సెప్టెంబరు 2: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాలన్నీ జలమయమయ్యాయి. పలు గ్రామాల రోడ్లు తెగిపోయాయి. పలు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లోని చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. కొండపాక మండలంలోని దుద్దెడ,బందారం, అంకిరెడ్డిపల్లి, సిర్సనగండ్ల దమ్మక్కపల్లి తదితర గ్రామాల్లోని చెరువులు మత్తడి పారుతున్నాయి. ఏనాడు నిండని చెరువులోకి నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వరుసగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. బందారం గ్రామంలో రోడ్డు మరమ్మతు పనులు మధ్యలో నిలిచిపోవడంతో వర్షానికి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. దుద్దెడ నుంచి దర్గా వెళ్లే రోడ్డు తెగి ప్రమాదకరంగా మారింది. దుద్దెడ నుంచి అంకిరెడ్డిపల్లి కి వెళ్లే రోడ్డు తెగిపోయింది. ఖమ్మంపల్లి గ్రామ చెరువుకు నీరు రావడానికి ఎలాంటి అవకాశాలు లేవు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి మండలంలోని పలు గ్రామాల చెరువులు నింపడానికి కాలువలు నిర్మించారు. ఈ కాలువ కమ్మంపల్లి, మర్పడగ చెరువుల వద్దకు రాకముందే అసంపూర్తిగా నిలిచిపోవడంతో తపాస్ పల్లి నీరు వీటిలోకి రాలేదు. నీరు లేకుండా బోసిగా ఉన్న చెరువులోకి నీరు నింపడానికి గ్రామస్థులు ఆలోచన చేశారు. వర్షపు నీరు వేరే వైపు వృధా పోకుండా గ్రామ చెరువులోకి వచ్చేవిధంగా రైతులు సొంత డబ్బులతో ఎక్స్‌కవేటర్ తెప్పించి కాలువ తీయించారు. వృధాగా పోతున్న నీటిని చెరువులోకి మళ్లించారు.

●సిద్దిపేట రూరల్: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో చెరువులు, కుంటలు నిండి మత్తళ్లు దూకుతున్నాయి. సోమవారం అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి వర్షాలకు జరిగిన నష్టాలను పరిశీలించి, బాధితులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులు, కుంటలు నిండి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మత్తడి దూకుతున్న ఎల్లమ్మ చెరువు

హుస్నాబాద్, సెప్టెంబరు 2: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సోమవారం సాయంత్రం నుంచి మత్తడి దూకుతుంది. దాదాపు 3వేల ఎకరాలకు పైగా సాగునీటితో పాటు పట్టణ ప్రజలకు మంచినీటిని అందించే హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మత్తడి పడుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 19 ఫీట్ల సామర్థ్యం ఉన్న ఈ చెరువు 17 ఫీట్లకు చేరుకుంటే మత్తడి పడుతుంది.

అలుగుపారుతున్న ఇటిక్యాల చెక్‌డ్యాం

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 2: తిగుల్, రాయవరం గ్రామాల మధ్య రాచకట్ట జలాశయం పూర్తిగా నిండి మత్తడి దూకుతున్నది. ఇటిక్యాల గ్రామంలో కూడవెల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ పొంగిపొర్లుతుంది. మునిగడప పెద్ద చెరువు అలుగు పారుతుంది. గ్రామాల్లో చెరువులు, కుంటలు పూర్తిగా నిండి నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా రెండు, మూడురోజులు భారీ వర్షాలు కురుస్తుండడంతో వివిధ పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మా రోడ్డు బాగు చేయరూ..?

దుబ్బాక/మిరుదొడ్డి, సెప్టెంబరు 2: దుబ్బాక మండలం బల్వంతాపూర్ నుంచి సిద్దిపేట రహదారి వర్షం కురిస్తే బంద్ అవుతున్నది. రహదారి పక్కన మల్లన్నసాగర్ కాల్వ పనులు చేపట్టి, రహదారి కంటే ఎక్కువ ఎత్తులో ఉండడంతో వరదనీరు వచ్చి చేరుతుంది. మాజీ సీఎం కేసీఆర్ స్వగ్రామం చింతమడకను అనుకుని ఉన్న ఈ గ్రామం నుంచే రైతులు దుబ్బాకకు కూరగాయాలు, రాకపోకలు సాగిస్తారు. బల్వంతాపూర్ గ్రామస్థులు ఇదే రహదారి గుండా సిద్దిపేట వెళ్తుంటారు. చింతమడక నుంచి దుబ్బాకకు, బల్వంతాపూర్ నుంచి సిద్దిపేటకు రహదారి రాకపోకలు స్థంభించి, ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రహదారికి వంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బల్వంతాపూర్- సిద్దిపేట రహదారిపై పారుతున్న నీరు

అలాగే మిరుదొడ్డి మండలం అల్వాల్‌లోని కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సిద్దిపేటకు వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక ఎస్‌ఐ పరశురాములు, గ్రామస్థుల సహకారంతో హెచ్చరిక బోర్డులతో పాటు ముళ్ల కంచెలను ఏర్పాటు చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి



గజ్వేల్ పట్టణంలో వర్షానికి నిలిచిన నీటిని తొలగింపజేస్తున్న రాజమౌళి

గజ్వేల్/మద్దూరు/ధూళిమిట్ట, సెప్టెంబరు 2: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి సూచించారు. గజ్వేల్ పట్టణంలో వర్షం కారణంగా నిలిచిన నీటిని ఆయన మునిసిపల్ కమిషనర్ గొల్కొంగ నరసయ్య, కౌన్సిలర్లతో కలిసి ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగింపజేశారు. అనంతరం ప్రజ్ఞాపూర్ ఊర చెరువును పరిశీలించి చెరువు వద్ద పలు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయనవెంట మునిసిపల్ కౌన్సిలర్లు రజిత, ఉప్పల మెట్టయ్య, భాగ్యలక్ష్మి, కురాకుల శ్రీనివాస్, మునిసిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఉన్నారు. మద్దూరు మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దార్ సంజీవ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా గాగిళ్లాపూర్ పెద్ద చెరువు వద్ద గల పరిస్థితులను పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రమేష్, రికార్డు అసిస్టెంట్ వెంకటేష్, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే వల్లంపట్లలో-1, లద్నూరులో-4, గాగిళ్లాపూర్‌లో-2, సలాఖ్‌పూర్‌లో-1 చొప్పున పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను ఆయన పరిశీలించారు. ధూళిమిట్ట మండలంలోని దుబ్బాతండా గ్రామాన్ని ధూళిమిట్ట తహసీల్దార్ ఎస్.మధుసూదన్ సందర్శించారు. గ్రామంలోని వర్షం నీరు చెరువులకు పోయే కాలువకు అడ్డుగా పోసిన మట్టిని తొలగింపజేశారు.

మంగోల్‌లో కూలిన పాత ఇండ్లు

కుకునూరుపల్లి, సెప్టెంబరు 2: కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఉమ్మడి కొండపాక మండలం ఎంపీడీవో వెంకటేశ్వర్లు పర్యటించి, పారిశుధ్య కార్యక్రమాని పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంగోల్ గ్రామంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి గ్రామానికి చెందిన నర్సింహులు, ఐలయ్య, జాగూర్‌లకు చెందిన పాత పెంకుటిల్లు సోమవారం కూలిపోయాయి. కూలిన ఇళ్లను గ్రామపంచాయతీ కార్యదర్శి కృష్ణ పరిశీలించారు. మేదినీపూర్ రాజీవ్ రహదారిపై గాలికి రోడ్డుపైకి వంగిన చెట్లను సిబ్బంది తొలగించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్)

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 2: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్(29) మూడురోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు అంతటా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గ్రామ శివారులో మృతదేహం ఉన్నదని సమాచారం రావడంతో.. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు దుర్గారావుగా గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన శ్రీనివాస్

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 2: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామానికి చెందిన శ్రీనివాస్(42) పని నిమిత్తం సోమవారం పట్టణానికి వచ్చాడు. తిరిగి ఇంటికొచ్చే క్రమంలో మధ్యలో ఆగాడు. బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

అనారోగ్యంతో గొర్రెలు మృతి

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 2: అనారోగ్యంతో గొర్రెలు మృతిచెందిన సంఘటన నారాయణరావుపేట మండం జక్కాపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నిరుగొండ దేవయ్యకు చెందిన 84 గొర్రెలు వారంరోజులుగా వింత వ్యాధితో మృత్యువాత పడుతున్నాయి. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్‌రావు, ఆర్‌ఐ అర్జున్‌రెడ్డి, పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మృతిచెందిన గొర్రెలను సిద్దిపేట పశు వైద్యశాల ల్యాబ్‌కు తరలించి పోస్టుమార్టం చేయించారు. కాగా బాధితుడు దేవయ్యను పలువురు నాయకులు పరామర్శించారు.


ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీ పట్టివేత

కొండపాక, సెప్టెంబరు 2: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సిద్దిపేట త్రీటౌన్ పోలీసులతో కలిసి పట్టుకున్నారు. సోమవారం ఉదయం కొండపాక మండలం నాగులబండ సమీపంలో ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వద్ద హైదరాబాద్ వెళ్తున్న ఇసుక లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్ సంతోష్, యజమాని భాస్కర్ వద్ద అనుమతికి సంబంధించిన పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొండపాక, సెప్టెంబరు 2: ఒకినవా మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ఇన్‌స్ట్రక్టర్ నర్సింహులు తెలిపారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగిన పోటీల్లో దుద్దెడ కు చెందిన ప్రవాస్ (గోల్డ్), పవన్ (సిల్వర్), చరణ్, అక్షయ, ధనుష్‌లు కాంస్య పతకాలు సాధించినట్టు తెలిపారు. వీరు నవంబరులో పూణేలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఘనంగా సహస్ర బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం



బిల్వాల అలంకరణలో మల్లన్నస్వామి

చేర్యాల, సెప్టెంబరు 2: శ్రావణమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం సహస్ర బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వీరశైవార్చకులు, వీరశైవాగమపాఠశాల పండితుడు, విద్యార్థులు శాస్త్రోక్తయుక్తంగా పూజలు జరిపారు. బిల్వార్చన, అభిషేకం అనంతరం అన్నపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు సురేందర్, శ్రీరాములు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మర్కుక్, సెప్టెంబరు 2: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్ 2008-2009 సంవత్సరం పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాల వేదికగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామకృష్ణ, రాజయ్య, వందన, లక్ష్మణస్వామి, పద్మారెడ్డి, రాఘవరెడ్డి, యాదగిరి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్ డ్యాన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోహెడ, సెప్టెంబరు 2: కోహెడ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు వేములవాడ దేవస్థానంలో నిర్వహించిన నేషనల్ లెవల్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్టివల్‌లో.. గ్రూప్ డ్యాన్స్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి, 2024 నటరాజ్ అవార్డును గెలుచుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వేములవాడ ఆలయ ఈవో వినోద్‌రెడ్డి చేతులమీదుగా పాఠశాల కరెస్పాండెంట్ అంజయ్యకు జాతీయ నంది అవార్డుతో పాటు సర్టిఫికెట్ అందజేసి సన్మానించారు.

'సిద్దిపేటకు హుస్నాబాద్ ఆర్టీసీ బస్సులు నడిపించాలి'

హుస్నాబాద్, సెప్టెంబరు 2: సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు హన్మకొండకు హుస్నాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులను నడిపించాలని సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలని కోరారు. సిద్దిపేట జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే తగిన సమయంలో బస్సులు ఉండటం లేదన్నారు.

సమాచారం

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి: ఏసీపీ

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 2: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు. వినాయక మండపాల ఆర్గనైజర్లు, కార్యవర్గ సభ్యులతో సిద్దిపేట ఎన్జీవోస్ భవన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గణపతిని ప్రతిష్ఠించుకునే ఆర్గనైజర్లు, కమిటీ మెంబర్లు పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

●మిరుదొడ్డి: ప్రశాంతమైన వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని అక్బర్‌పేట-భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ పార్టీలు, కులసంఘాలతో పీస్‌కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు.

ఖాళీ సీట్ల భర్తీకి 5న స్పాట్ అడ్మిషన్లు

చేర్యాల: చేర్యాల పట్టణంలోని నర్మెట్ట సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, సీఈసీ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మన్విచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసి సంబంధిత ధ్రువపత్రాలతో పాఠశాలలో జరిగే కౌన్సిలింగ్‌లో పాల్గొనాలన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: ఏవో

మద్దూరు: అధిక వర్షాల వల్ల పత్తి మొక్కలు పసుపు రంగులోకి మారే క్రమంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని వల్లంపట్లలో రైతు గుండెగోని లలిత సాగుచేసిన పత్తి పంటను సందర్శించి పరిశీలించి మాట్లాడారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మద్దూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌వి లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రఘు ఆధ్వర్యంలో మలేరియా రాపిడ్ టెస్ట్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

రుణమాఫీ నిర్ధారణ ప్రక్రియను వేగవంతం చేయండి: ఏడీఏ

తొగుట: రైతు రుణమాఫీ నిర్ధారణ ప్రక్రియను వేగవంతం చేయాలని దుబ్బాక ఏడీఏ మల్లయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం తొగుట రైతువేదికలో జరుగుతున్న రుణమాఫీ నిర్ధారణ ప్రక్రియ తీరుతెన్నులను పరిశీలించారు.

●గజ్వేల్: కుటుంబ నిర్ధారణతోనే రుణమాఫీ జరుగుతుందని గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏడీ బాబునాయక్ అన్నారు. గజ్వేల్‌లోని రైతువేదికలో మండల వ్యవసాయశాఖ అధికారి నాగరాజుతో కలిసి రైతుల కుటుంబ నిర్ధారణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్: సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆశ్రిత్‌కుమార్‌ను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు సాకి ఆనంద్, పయ్యావుల ఎల్లం, అలకుంట మహేందర్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి: షబ్బీర్ అలీ



షబ్బీర్‌అలీని కలిసిన గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, నర్సారెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 2: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నేతృత్వంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సర్దార్‌ఖాన్, తంజిముల్ మజీద్ కమిటీ చైర్మన్ మతీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు ఆయనను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని కోరగా.. తప్పకుండా వస్తానని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పంట రుణమాఫీ, ఆరు గ్యారంటీలతో పాటు ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గజ్వేల్‌ను కాంగ్రెస్ పార్టీకి అడ్డాగా నిరూపించాలని కోరారు. వారితో ఏఎంసీ డైరెక్టర్లు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, హరినాథ్‌గుప్తా, డాక్టర్ వహీద్ తదితరులు ఉన్నారు.

భావితరాలకు ముత్యంరెడ్డి జీవితం ఆదర్శం



ముత్యంరెడ్డి విగ్రహానికి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పూలమాలవేస్తున్న నర్సారెడ్డి

తొగుట/దుబ్బాక/మిరుదొడ్డి/దౌల్తాబాద్, సెప్టెంబరు 2: భావితరాలకు ముత్యంరెడ్డి జీవితం ఆదర్శంగా నిలుస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి కొనియాడారు. సోమవారం తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలోని స్మృతివనంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్వర్గీయ ముత్యంరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంతకుముందు ఆయన సతీమణి విజయలక్ష్మి ముత్యంరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ కో ఆర్డినేటర్ చెరుకు విజయ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అక్కం స్వామి, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో దుబ్బాక మాజీ ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి వర్ధంతి నిర్వహించారు. మిరుదొడ్డి మండలం అల్వాల్ చౌరస్తాలోని మాజీ ఎమ్మెల్యే ముత్యంరెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. దుబ్బాకలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో ముత్యంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో మాజీమంత్రి చెరుకు ముత్యంరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పడాల రాములు నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు.

మారుమోగిన శివనామస్మరణం

- ఘనంగా ముగిసిన దుబ్బరాజేశ్వర జాతర



దుబ్బాకలో నీలకంఠేశ్వరుడి పల్లకీ ఊరేగింపు

దుబ్బాక, సెప్టెంబరు 2: శ్రావణమాసం చివరి సోమవారంతోపాటు సోమవతి అమావాస్య సందర్భంగా సోమవారం దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి మండల గ్రామాల్లోని ప్రధాన ఆలయాలు శివనామస్మరణంతో మారుమోగాయి. ఈ సందర్భంగా ప్రతిఏటా జరిగే చౌదర్‌పల్లి దుబ్బ రాజేశ్వరాలయం జాతర ఘనంగా ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో దుబ్బ రాజేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి తమ్మల దుబ్బరాజశర్మ, భానుశర్మలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుబ్బాకలోని నీలకంఠేశ్వరుడి శ్రావణమాసం చివరి సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. నీలకంఠుడి పల్లకీ ఊరేగింపు దుబ్బాక పట్టణంలో నిర్వహించారు. నీలకంఠ సంఘం నాయకులు అలేటి చంద్రమౌళి, రాజు, అజ్జశేఖరం, బోడ శ్రీహరి, చందు, తుమ్మ బాను, అజ్జరాజేశ్వర్, అజ్జబాల్‌రాజ్, వీరబత్తిని లింగం, తుమ్మదుబ్బరాజం తదితరులున్నారు. అలాగే దుబ్బాక కేదారీశ్వరాలయంలో అన్నపూజ, సామూహిక అభిషేకాలు నిర్వహించారు. దుబ్బాక గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పల్లకీ సేవా, ఊరేగింపు నిర్వహించారు.

మర్పడగ క్షేత్రంలో సోమవతి అమావాస్య పూజలు

కొండపాక, సెప్టెంబరు 2: కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో సోమవతి అమావాస్యను పురస్కరించుకుని మహిళలు పూజలు నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమైంది. క్షేత్రం ఆవరణలోని రావిచెట్టు వద్ద శివపార్వతుల విగ్రహాలకు పూజలు చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం: డిప్యూటీ డీఎంహెచ్‌వో

సిద్దిపేట టౌన్/చిన్నకోడూరు, సెప్టెంబరు 2: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో రేవతి తెలిపారు. సోమవారం సిద్దిపేట పట్టణం కేసీఆర్‌నగర్‌లోని బస్తీ దవాఖానా, చిన్నకోడూరు మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వడం ద్వారా దోమలు వృద్ధి చెందే అవకాశముంటుందని, నీరు కలుషితం కావడం జరుగుతుందన్నారు. కాబట్టి ప్రతీ గ్రామంలో ఇంటి పరిసరాల్లో డ్రైడేను పాటిస్తూ, నీటి నిల్వలను తొలగించాలని సూచిచారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ విజయ్‌కృష్ణ, డాక్టర్ మౌనిక, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాధుల పట్ల అవగాహన ఉండాలి

నంగునూరు, ఆగస్టు 2: విద్యార్థులకు వ్యాదుల పట్ల అవగాహన ఉండాలని ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్ అన్నారు. సోమవారం నంగునూరు మండలం పాలమాకుల షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వచ్చే వ్యాదులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలని వార్డెన్ గణేష్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాలపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సరిత, హెచ్‌ఈవో స్వామి, సూపర్‌వైజర్ అనురాధ, ఏఎన్ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ మహేందర్ పాల్గొన్నారు.

ఓపెన్ ప్లాట్లు చదును చేసుకోకపోతే చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్, సెప్టెంబరు 2: హుస్నాబాద్ పట్టణంలోని ఓపెన్ ప్లాట్లను చదును చేసుకోకపోతే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ ఆకుల రజిత హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. మొదట ఓపెన్ ప్లాట్లు ఉన్న యజమానులకు నోటీసులు జారీచేయాలని తీర్మానించారు. ఓపెన్ ప్లాట్లతో తుమ్మలు, తుప్పలు మొలిచి ఇతరులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఖాళీ స్థలం ఉన్న యజమానులకు వెకెంట్ ల్యాండ్ టాక్స్ విధించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు బోజు రమాదేవి, కోమటి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివి



గజ్వేల్: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 2: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయనవెంట ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, తన్జీముల్ మసాజిద్ కమిటీ చైర్మన్ సయ్యద్ ఉన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ విగ్రహానికి టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు పూలమాలవేసి నివాళులర్పించారు.

●వర్గల్: వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గం ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి అన్నారు. సోమవారం వర్గల్ మండల కేంద్రంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

●చిన్నకోడూరు: చిన్నకోడూరు మండలంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడు బంక చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్ ఫ్లెక్సీకి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్లయ్య, మధు, అజ్జు యాదవ్ పాల్గొన్నారు.

●చేర్యాల: మాజీ సీఎం వైఎస్సార్ వర్ధంతిని సోమవారం చేర్యాల, కొమురవెల్లి మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

●ములుగు: మండల పరిధిలోని ములుగు, అన్నాసాగర్, కొత్తూరు, వంటిమామిడి, క్షీరాసాగర్‌తో పాటు పలు గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ గజ్వేల్ మండలాధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

●బెజ్జంకి: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా బెజ్జంకి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

●ధూళిమిట్ట: ధూళిమిట్ట మండల కేంద్రంలో వైఎస్సార్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. మండలాధ్యక్షుడు కోల సాయిలుగౌడ్, బెక్కల్ దేవస్థానం చైర్మన్ మల్లేశం పాల్గొన్నారు.

●మద్దూరు: మద్దూరు మండల కేంద్రంలో మాజీ సీఎం వైఎస్సార్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

●దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో వైఎస్సార్ చిత్రపటాలకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పడాల రాములు పూలమాలవేసి నివాళులర్పించారు.

●దుబ్బాక/మిరుదొడ్డి: దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. మిరుదొడ్డి మండలం అల్వాల్ చౌరస్తాలో వైఎస్సార్ చిత్రపటానికి కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే దుబ్బాకలోని కాంగ్రెస్ కార్యాలయంలో, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోనూ వర్ధంతిని నిర్వహించారు.

●నంగునూరు: నంగునూరు మండలం మగ్దుంపూర్‌లో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా టీపీసీసీ సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

●కొండపాక: వైస్సార్ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలంలోని వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద నిర్వహించారు. కుకునూరుపల్లి, కొండపాక మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విరుపాక్ష శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

●సిద్దిపేట టౌన్: దివంగత నేత, మాజీ సీఎం వైస్సార్ వర్ధంతి సందర్భంగా సిద్దిపేటలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పూజల గోపీకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు.